

పనులు సకాలంలో పూర్తిచేయాలి
గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ ద్వారా చేపట్టిన పనులను గడువులోపు పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అధికారులను ఆదేశించారు. -8లో▸



రామప్పలో పర్యాటకుల సందడి
రామప్ప దేవాలయానికి పర్యాటకులు, విద్యార్థులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయం పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. -8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $33^0/19^0$
జిల్లాలో వాతావరణం ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉంటుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత ఉంటుంది.

'న్యూ' జోష్..

2023కు ఘన స్వాగతం
- అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబురాలు
- అర్ధరాత్రి కేక్ కటింగ్‌లు..



బేకరీలో కేక్‌లు కొనుగోలు చేస్తున్న యువకులు



నూతన సంవత్సరం సందర్భంగా ఏటూరునాగారంలో కేక్ కట్ చేస్తున్న ప్రజలు

ఏటూరునాగారం: ఎన్నో తీపి గుర్తులు.. చేదు అనుభవాల నడుమ 2022వ సంవత్సరం చరిత్ర పుటల్లో కలిసి పోయింది. చీకటి నుంచి వెలుగు వైపు పరుగులు తీస్తూ.. కోటి ఆశలతో శనివారం అర్ధరాత్రి 12 గంటలకు 2023 ఆంగ్లసంవత్సరానికి జిల్లా ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ములుగు, ఏటూరునాగారం, మంగపేటతో పాటు పలు ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. బేకరీలు, బిర్యాని సెంటర్లు,కూల్‌డ్రింక్స్ షాపుల వద్ద యువకుల సందడి నెలకొంది. స్నేహితులంతా కలిసి సంబురాలు జరుపుకున్నారు. మరికొంత మంది బాణసంచా కాల్చుతూ కేరింతలు కొట్టారు.

'కోడిగుడ్లు ఇవ్వలేం'

ములుగు రూరల్(గోవిందరావుపేట): ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్లను అందించలేమని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ అన్నారు. గోవిందరావుపేట మండల పరిధిలోని మచ్చాపూర్ ప్రభుత్వ పాఠశాలలో వంట కార్మికులు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వంట కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలన్నారు. జనవరి 18న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కొత్త ఆలోచనలతో.. అభివృద్ధి దిశగా..

- న్యూ ఇయర్ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయం

ములుగు/ ఏటూరునాగారం: గత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. నూతన సంవత్సరంలో అడుగు పెట్టిన సందర్భంగా జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు జిల్లా సమగ్రాభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు చేర్చడంతో పాటు ప్రణాళికతో ముందుకెళ్తామని మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సీతక్క, జెడ్పీ చైర్మన్ జగదీశ్, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్‌లు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు వారు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కేసీఆర్ సహకారంతో మరింత అభివృద్ధి..



గడిచిన ఏడాది ప్రజల సేవలో నిమగ్నమయ్యాం. సీఎం ఆశీస్సులతో ప్రజా సంక్షేమంలో భాగస్వామినయ్యాను. ఈ ఏడాదిలో సీఎం కేసీఆర్ సహకారంతో మరింత అభివృద్ధి చేసేందుకు నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తా.

-సత్యవతి రాథోడ్, రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి

ప్రజలు సుఖశాంతులతో..



నూతన సంవత్సరంలో ప్రభుత్వం అందించే నిధులతో ప్రజలు, గ్రామాలు అభివృద్ధిలో ముందుకు వెళ్లేలా చూస్తా. ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా, ఆర్థికంగా జీవించాలి. జిల్లా అన్ని రంగాల్లో ముందుకువెళ్లేలా కృషి చేస్తా.

- కృష్ణ ఆదిత్య, కలెక్టర్

ప్రజలకు అండగా ఉంటా..



ఎమ్మెల్యేగా నాలుగు సంవత్సరాల పదవికాలం పూర్తి అయింది. ఇప్పటివరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పరిష్కరించాను. ఇక ముందు సైతం ప్రజలకు అండగా ఉంటాను. ఎక్కడైనా సమస్యలు ఉంటే నేరుగా నాతో మాట్లాడవచ్చు. ఆయా శాఖల ఉన్నతాధికారులను కలిసి నిధులు మంజూరు చేసేలా చూస్తాను. అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూస్తా.

- సీతక్క, ములుగు ఎమ్మెల్యే

సంక్షేమ పథకాలు అందేలా చూస్తా..



ప్రభుత్వం తరఫున అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందేలా చర్యలు తీసుకుంటా. 2023లో జిల్లా ప్రజలకు మంచి జరగాలి. ఆపదలో ఉన్నవారిని పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుంది. కార్యకర్తలు పార్టీ అభ్యున్నతికి సైనికుల్లా పనిచేయాలి.

- కుసుమ జగదీశ్, జెడ్పీ చైర్మన్

గిరిజన విద్య, వైద్యంపై దృష్టి



ఏటూరునాగారం గిరిజనులకు మెరుగైన విద్య, వైద్యం అందించడానికి 2023వ సంవత్సరం నుంచి ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతాను. నూతన సంవత్సరంలో గిరిజనులను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తాం. వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం. ఐటీడీఏకు వచ్చి గిరిజనులు సమస్యలను నేరుగా పరిష్కరించుకోవాలి.

- అంకిత్, ఐటీడీఏ పీఓ



రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని రామప్ప దేవాలయంలో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, విద్యార్థులు అధికసంఖ్యలో తరలివచ్చి రుద్రేశ్వరున్ని దర్శించుకున్నారు. నందీశ్వరుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ విశిష్టతను గైడ్ విజయ్‌కుమార్ ద్వారా తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. అదే విధంగా ఏటూరునాగారానికి చెందిన ఎఫ్‌డీఓ ప్రశాంత్ బాజీరావు పటేల్ తన కుటుంబ సభ్యులతో రామప్పను సందర్శించారు. రుద్రేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ శిల్పకళా సంపదను పరిశీలించి అద్భుతంగా ఉందని కొనియాడారు.


నంది విగ్రహం వద్ద విద్యార్థుల సందడి



సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సంబురాలు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించారు. కృష్ణకాలనీలోని సేవా భవన్‌లో జరిగిన కార్యక్రమానికి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు, సేవా. అధ్యక్షురాలు మాధవిశ్రీనివాసరావు హాజరయ్యారు. సేవాసభ్యులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ కార్యదర్శి వాసవిప్రసాద్, పీఎం తుకారాం, సీనియర్ పీఓ శ్యామ్‌ప్రసాద్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, కమ్యూనికేషన్‌సెల్ కోఆర్డినేటర్ ఉత్తమ్‌కుమార్, సేవా కార్యదర్శి లక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.


కేక్ కట్‌చేస్తున్న సేవా సమితి అధ్యక్షురాలు, సభ్యులు

పనులు సకాలంలో పూర్తిచేయాలి

● ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం:గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ ద్వారా చేపట్టిన పనులను జనవరి 3వ వారం లోపు సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంజనీరింగ్ పనుల వివరాలను ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంజనీర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు వారి పరిధిలో ఉన్న పనులను త్వరితగతిన నాణ్యతతో పనులు చేయించాలన్నారు. రోడ్లు, భవనాలు, పాఠశాలల్లో మరమ్మతులు, సబ్ సెంటర్ల నిర్మాణాలు, అంగన్‌వాడీ భవనాల ఆధునీకీకరణ పనులు చేపట్టాలన్నారు. ఏటూరునాగారంలోని డయాగ్నస్టిక్ సెంటర్‌ను వెంటనే పూర్తి చేయాలని, అలాగే మెడికల్ ఆఫీసర్స్ రెసిడెన్షియల్ క్వార్టర్స్, కాకతీయ యూనివర్సిటీ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, హన్మకొండ, వరంగల్‌లో జరుగుతున్న పనులను సకలంలో పూర్తి చేయించాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నాణ్యత లోపాలను గుర్తించాలన్నారు. నాసిరకం పనులు ఉంటే సంబంధిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అటవీశాఖ క్లియరెన్స్‌లో ఏమైనా పనులు పెండింగ్‌లో ఉంటే ప్రతిపాదనలను జిల్లా స్థాయిలో క్లియరెన్స్ కోసం సబ్ డివిజనల్ స్థాయి మీటింగ్ మినిట్స్‌తో పాటు స్థాయి కమిటీలో సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ హేమలత, డీఈఈలు నవీన్, సంపత్‌కుమార్, రాంరెడ్డి, ఏఈఈలు ప్రశాంత్, అబీద్‌ఖాన్, దేవిశ్రీ, చందర్‌రావు, పుల్లయ్య, రఫిక్, టీఏలు రాము, లక్ష్మణ్, రవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అంకిత్

మెనూ పాటించాలి

కన్నాయిగూడెం: ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం అహారం అందించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహం, తుపాకులగూడెంలోని ఏహెచ్‌ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం వంటరూంలోని ఆహార పదార్థాలను పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వాటిని అందించాలన్నారు. పక్కదారి పట్టినట్లు తెలిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ద్వారా మాత్రమే తాగునీరు ఇవ్వాలన్నారు. మరుగుదొడ్లు, మిషన్ భగీరథ కనెక్షన్ పనితీరును తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని పాఠశాలల్లో వంటను పరిశీలించారు. పూర్తి వివరాలను ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌ను అడిగి తెలుకున్నారు. విద్యార్థులకు స్వెటర్లు, డార్మెంటరీ, బ్లాంకెట్స్‌పై ఆరా తీశారు.


గిరిజన బాలుర వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ అంకిత్



పకడ్బందీగా అమలు చేయాలి

ములుగు: జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అప్పయ్య సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. గర్భిణులకు రిజిస్ట్రేషన్ సాధ్యమైనంత తొందరగా చేయాలని, రక్తహీనత రాకుండా ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు ఇప్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు అయ్యేలా చూడాలన్నారు. గర్భిణులు అందరికీ బ్లడ్ గ్రూపు టెస్ట్ నిర్వహించాలన్నారు. సాధారణ కాన్పులనే ప్రోత్సహించాలన్నారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలపై సమీక్షిస్తూ చిన్నారులందరికీ టీకాలు అందజేయాలన్నారు. ఆశ కార్యకర్తల సేవలను వినియోగించుకోవాలని కోరారు. వ్యాధి నిరోధక టీకాలపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని చిన్నారులకు 100శాతం టీకాలు అందజేయాలని తదితర విషయాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది డెమో తిరుపతయ్య, సీహెచ్ దుర్గారావు, హెచ్‌ఇ సంపత్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి 'ఆపరేషన్ స్మైల్'

● అదనపు ఎస్పీ శ్రీనివాసులు

భూపాలపల్లి: బాలల సమస్యలు లేని ఆదర్శ జిల్లాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాను తీర్చిదిద్దాలని, ఇందుకోసం అధికారులు సమష్టిగా కృషి చేయాలని అదనపు ఎస్పీ వి.శ్రీనివాసులు కోరారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు, మహిళ, శిశు సంక్షేమ శాఖ తరఫున జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కార్మిక శాఖ, తదితర శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. 2023 సంవత్సరం జనవరి 1నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ స్మైల్ 9వ విడత ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఒక ఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లు, డీసీపీయూ సిబ్బంది, సహాయ కార్మిక అధికారి, రెవెన్యూ ఆర్‌ఐ, చైల్డ్‌లైన్ సిబ్బందితో కలిపి జిల్లాలో డివిజన్ స్థాయిలలో రెండు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు జిల్లాలో తప్పిపోయిన, పారిపోయిన, బా ల కార్మికులు, భిక్షాటన చేసే వారిని గుర్తించి బాలల సంక్షేమ సమితి ఎదుట హాజరు పరుస్తారన్నారు.





ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

● కలెక్టర్ కృష్ణ ఆదిత్య

ములుగు: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ అదనపు కలెక్టర్ వైవీ.గణేష్‌తో కలిసి సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు జనవరి 20 వరకు పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు 60వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. ఇంకా రావాల్సిన వరిధాన్యం సుమారుగా జిల్లాలో 30వేల నుంచి 40 వేల మెట్రిక్ టన్నులు రావచ్చని అంచనా వేశారు. పీపీసీ సెంటర్లలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మిల్లర్లు ఓపీఎంఎస్ చేసుకోవాలని సూచించారు. రైతుల వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే త్వరగా డబ్బులు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని, చెత్త, తాలు లేకుండా శుభ్రమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని కలెక్టర్ వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ నాగపద్మజ, డీసీఎస్‌ఓ అరవింద్ రెడ్డి, డీఎం రాములు, డీసీఓ సర్దార్ సింగ్, జీసీసీ మేనేజర్ ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ సీఈఓలు, ఐకేపీ, ఏపీఎంలు, జీసీసీ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది పనితీరు భేష్

ములుగు గ్రామపంచాయతీ సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉందని కలెక్టర్ అభినందనలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణంలో సర్పంచ్ బండారి నిర్మల అధ్యక్షతన శనివారం నిర్వహించిన గ్రామపంచాయతీ సిబ్బంది, అధికారులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీపీ సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉందని, సిబ్బంది ఆరోగ్యాలను కాపాడుకుంటూ పంచాయతీ అభివృద్ధిలో కృషి చేయాలన్నారు. గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డ్ కోసం అదనంగా స్థల సేకరణ చేసుకోవాలని సూచించారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కలెక్టర్ గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ కె.వెంకయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి దేవరాజ్, మండల అభివృద్ధి అధికారి ఇక్బాల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్, గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ వంగ సుమలత, పాలకమండలి, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ


కాళేశ్వరాలయం వ్యూ(ఫైల్)

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయం ధర్మకర్తల మండలికి దరఖాస్తుల స్వీకరణకు రాష్ట్ర దేవదాయశాఖ ఉత్తర్వులు ఇచ్చినట్లు ఈఓ మహేష్ శనివారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. శనివారం నుంచి 20 రోజుల లోపు ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని ఈఓ పేర్కొన్నారు.

మూడేళ్లుగా ఖాళీ..

కోర్టు వ్యవహారాలతో మూడేళ్లుగా కాళేశ్వరాలయం దేవస్థానం ధర్మకర్తల మండలి లేక ఖాళీగా ఉంది. ప్రస్తుతం దేవదాయశాఖ నోటిఫికేషన్ ఇవ్వడంతో ఇన్నేళ్లుగా ఎదురు చూస్తున్న నాయకుల్లో ఉత్సాహం పెరిగింది. 2020లో అప్పటి చైర్మన్ బొమ్మెర వెంకటేశం పదవి ముగియకముందే కరోనాతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ తరువాత ధర్మకర్తగా ఉన్న గంట రాంనారాయణగౌడ్ నెల రోజుల పాటు చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన పదవి ముగియడంతో ఆ తర్వాత పాలకమండలి నియామకం జరుగలేదు. అప్పటి నుంచి ఆశావహులకు అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం నోటిఫికేషన్ వెలువడటంతో ఆసక్తి గల అభ్యర్థులు ఇప్పటికే మంథని, భూపాలపల్లి, హైదరబాద్‌లో అధికారపార్టీ నేతల వద్దకు పరుగులు తీస్తున్నట్లు తెలిసింది.

